## రెండో భాగం

# మంచిమనిషి

*

"మనిషిని చూడగానే అతని మంచిచెడ్డలు నిర్ణయించలేం!
కేవలం ఒక సంఘటనవల్లకూడా ఒక మనిషిని
మంచివాడుగానో, చెడ్డవాడుగానో
చెప్పలేం!"

*

ప్రభాతసమయం ...

మంగళవాయిద్యాలు మారుమోగుతుంటే– దేవస్థాన పురోహితులు– సుప్రభాతాన్ని వీనులవిందుగా ఆలపిస్తున్నారు. తెల్లని మేఘమాలికలు చుట్టూవున్న కొండల తాకిడికి తట్టుకోనలేక చెల్లాచెదురవుతున్నాయి. అర్చకుల వేదమంత్రపఠన మొకవైపు– యాత్రికుల 'గోవిందనామస్మరణ' వేరొకవైపూ– అక్కడి ప్రకృతి వింతశోభలతో– శ్రీనివాసుని దివ్యసందర్శనార్థం దూరతీరాలనుండి సైతం వచ్చిన అశేష యాత్రికజనావళినీ పులకాంకితుల్ని చేస్తోంది. అప్పుడే యాత్రికులు చాలామంది వరుసలో నిలబడి తిరుమలేశుని కనులారా, కరువుతీరా గాంచేందుకై తపించిపోతున్నారు. జనసమూహం చైత్రరథంలా కదులుతోంది. స్వామికి తమ మనసులోని ఆవేదనలు చెప్పుకుందుకుకూడా అవకాశాన్ని ఇవ్వకుండా అక్కడున్న అర్చకులు– "నడవండి! వెనుక ఇంకా చాలామంది వున్నారు" అంటూ జనాన్ని అదలిస్తున్నారు. వింతకాంతులతో విలసిల్లిపోతున్న వెంకటేశ్వర స్వామిని తమ కనులారా చూస్తున్న రెండుక్షణాలూ ఐహిక ప్రపంచాన్నే మరచిపోతోంది జనావళి. నల్లని ఆవిగ్రహంలో అంతటి ఆకర్షణ ఏమిటో? అది ఆకర్షణ కాదు– దైవశక్తి. నాస్తికుల్నిసైతం వశపరచుకొని, దేముడున్నాడనే సత్యాన్ని చాటిచెప్పే మహత్తరమైన శక్తి వుంది ఆవిగ్రహంలో!

వరుసలో నిలబడిన శ్రీధర్‌కు స్వామి సందర్శనభాగ్యం లభించలేదు. "టైమయిపోయింది" అంటూ తలుపులుమూశేశారు అర్చకులు. మిగిలిపోయిన యాత్రికులలో తానూ ఒకడయ్యాడు. గడచిన రెండు సంవత్సరాలుగా తాను శ్రీనివాసుని దర్శించుకోవా లనుకుంటున్నాడు. ఆనాటికి అవకాశం దొరికిందని మురిసిపోయాడు. కానీ భగవంతుడు తనకు 'ఆశపెడుతున్నాడేమో' అనుకున్నాడు శ్రీధర్. ఏమైనా ఆరోజు స్వామిదర్శనం కాందే ఆలయప్రాంగణం దాటి బయటకు వెళ్ళరాదనే నిశ్చయానికి వచ్చిన శ్రీధర్ ప్రత్యేక దర్శనానికి టిక్కెట్టు కొనుక్కొని తిరిగి స్వామి సాన్నిధ్యానికి వచ్చాడు.

ఆలయమంతా దాదాపు ప్రశాంతంగావుంది. సుగంధ ధూప, దీపాలతో తిరుమలేశుని విగ్రహం సమ్మోహనంగా మెరిసిపోతోంది. స్వామి దర్శనంతో పులకాంకితుడై అర మోడ్పు కనులతో- నమస్కరించాడు. తన కోరికలెన్నో ఆపదమొక్కులవానికి నివేదించుకోవా లనుకున్నాడు. కానీ తనమనసు శూన్యమైపోయింది. తన్ను తాను మరచిపోయాడు. కనీసం ఏడాదికొకసారైనా నీదివ్యస్వరూపాన్ని సందర్శించుకొనేభాగ్యం మాత్రం కలుగచేయుమని కోరుకున్నాడు శ్రీధర్. ప్రక్కనేవున్న 'గంట' శబ్దం కావటంతో- అక్కడి నిశ్శబ్దానికి- శ్రీధర్ ప్రశాంతమనస్సుకూ- అంతరాయం కలిగించింది. తన దృష్టిని ప్రక్కకు మరల్చాడు. తనకు పది

గజాలదూరంలోనే వున్న 'ఆమె' తనవైపే చూస్తూండటం గమనించిన శ్రీధర్ తప్పు చేసిన వానిలా ఉలిక్కిపడ్డాడు. ఆమెకు ఇరువైపులా- ఆమె తల్లితండ్రులు కాబోలు- భక్తి ప్రపత్తులతో కనులు మూసుకొని- వెంకటేశ్వరస్వామికి పూజ చేస్తున్నారు. శ్రీధర్ తన చూపుల్ని ఆమెనుండి మరల్చుకొనలేకపోయాడు.

*　　*

సంధ్యాసమయం...

సూర్యుడింకా అస్తమించలేదు. చుట్టువున్న చెట్లు గాలికి కట్టుకొనలేక, బాధతో- రొద చేస్తున్నాయి. ఎత్తైన కొండలమీదనుండి క్రిందనున్న నల్లని బండరాళ్ళపై బడి వింతశబ్దాన్నిస్తున్నది పాపనాశనజలపాతం. ఉదయం స్వామి దర్శనం కాగానే- ప్రత్యేక వసతి గృహంలో భోజనాల కార్యక్రమం తరువాత కొంతసేపు విశ్రాంతి తీసుకొని- ఆమధ్యాహ్నం మూడు గంటలకు, పాపనాశన జలపాతాన్ని చూసేందుకు తన తల్లిదండ్రులతో అక్కడకు వచ్చింది శ్రీదేవి. ఏకాంత సమయమూ- ప్రశాంత వాతావరణమూ, చల్లనిగాలీ, ప్రకృతిశోభా- ఇవన్నీ శ్రీదేవి ప్రాణాలు! విశాలమైన నీలాకాశంలో ఎగురుతున్న పక్షుల్ని చూసి నప్పుడు, దూరతీరాలకు ఎగిరిపోయే అవకాశం తనకు లేక పోయినందుకు ఎంతగానో పరితపించిపోయేది. ఎంత దూరం నుంచో విలాసంగా- తీరానికి పరుగున వచ్చి- చూపరులను

ఉల్లాసపరిచే సాగర కెరటాలను చూసినప్పుడు– తనెంతో అసూయపడేది. చెట్లపైకి చేరుకుంటున్న పక్షుల్ని తదేక దృష్టితో చూస్తోంది శ్రీదేవి. శ్రీధర్ అక్కడకు రావటం ఆమె గమనించలేదు.

"జలపాతాన్ని చూసేందుకు మీరుకూడా వచ్చినట్లున్నారే?"— అన్నాడు శ్రీధర్. త్రుళ్ళిపడి వెనక్కి చూసింది శ్రీదేవి. చిరునవ్వుతో నమస్కరించిన శ్రీధర్‌కు తానుకూడా అప్రయత్నంగానే ప్రతినమస్కారం చేసింది.

"ఉదయం ఆలయంలో మిమ్మల్ని చూశాను. చిర పరిచితుల్ని చూసిన అనుభూతి పొందాను. మీ పేరు చెప్ప టానికి మీకేమీ అభ్యంతరం ఉండదుగా!"— శ్రీధర్ లోని కలుపుగోలుతనం ఆమెను కట్టివేసింది. అందుకే తన పేరు చెప్పింది...

"అయితే పత్రికలలో కథలు వ్రాసే శ్రీదేవి మీరేనా కొంపదీసి?"—

"ఏం? కాకూడదా?— ఇటువంటి వాతావరణంలో వున్నప్పుడు, కవిత్వం చెప్పాలని ఎవరకనిపించదు చెప్పండి?" తలవంచుకునే జవాబు చెప్పింది శ్రీదేవి. ఏమో? నాకు మాత్రం మిమ్మల్ని చూస్తూంటే నేనూ కవిత్వం వ్రాయగల ననే ధైర్యం వస్తోంది"— అన్నాడు శ్రీధర్. శ్రీదేవికళ్ళు సిగ్గుపడ్డాయి. మళ్ళీ అన్నాడు శ్రీధర్–

'మీరు వ్రాసే కథలు– చాలామందిని ఉత్తేజపరిచే

ఉషస్సులు. ఈమధ్య వెలువడిన మీ నవల చదివాను. కథా వస్తువు ఏదైనా కానీయండి! దానికి మీరిచ్చే ప్రాముఖ్యతా, పాత్రలసృష్టి- చాలా విశిష్టంగా వుంటాయి. ముఖస్తుతి అనుకోకండి. మీలాగా వ్రాసేశక్తి చాలా తక్కువమందికి వుంటుందని నా అభిప్రాయం...'

శ్రీధర్ ఇంకా చెప్పబోయాడు. దూరంగా వున్న తన తల్లి పిలవడంతో- అతనివద్ద శలవుతీసుకొని అక్కడనుండి వెళ్ళిపోయింది శ్రీదేవి.

* * *

అంతటితో కథ వ్రాయటం ఆపుచేసింది శ్రీదేవి. తరువాత ఏమి వ్రాయాలో- ముగింపు ఏవిధంగా చేయాలో అంతుబట్టలేదు ఆమెకు.

* * *

రామకృష్ణయ్యగారు జిల్లాజడ్జిగా ధనసంపదలూ— కీర్తిప్రతిష్ఠలూ సంపాదించుకొని- రిటైరయ్యారు. ఆధునిక భావాలూ- ఆదర్శాలూ- వున్నవ్యక్తి. ఆయన ముఖంపై ఎప్పుడూ వుండే చిరునవ్వు ఆయనలోని మంచితనానికి నిదర్శనం. శ్రీదేవి రామకృష్ణయ్యగారి ఏకైకపుత్రిక. అతి గారంతో పెంచి పెద్దచేసినా- క్రమశిక్షణ అలవరచి, ఆమెకు కాలేజీచదువులుకూడా చెప్పించారు. వివిధరకాల గ్రంథాలు ఆయన చదివారు. శ్రీదేవిచేత చదివించారు. అందుకే భాషా పరిజ్ఞానాన్ని అచిరకాలంలోనే పెంపొందించుకొనగలిగింది.

శ్రీదేవి. తనలో కలిగే భావాల్ని అప్పుడప్పుడు- కాగితాల మీద వ్రాసేది. రామకృష్ణయ్యగారి సలహామీద వాటిని పత్రికలకు పంపటం, పాఠకుల మన్ననల నందుకోవటం కూడా జరుగుతూండేది. కథావస్తువుకు ఆమె ఇచ్చే ప్రాధాన్యతా- కథలలోని పాత్రలను పోషించే పద్ధతీ- ఆమెపేరును మరింత ఇనుమడింపచేశాయి. శ్రీదేవి వ్రాసిన కథగాని, నవలకాని పత్రికలలో ప్రచురణ జరిగితే- వాటిని చదవని పాఠకులు చాలా తక్కువమంది వుండేవారు. తన రచనలలో అంతటి ఆకర్షణ వున్నదనే విషయం శ్రీదేవినే ఆశ్చర్యపరచేది. ఎప్పుడూ తన గదిలో కూర్చొని తనను తాను మరచిపోయి- తలవంచుకొని- ఏదో ఒకటి వ్రాస్తూండే శ్రీదేవిని చూసి గర్వపడుతూండేవారు రామకృష్ణయ్యగారు. ఆమెతో మాట్లాడటానికి- భోజనాలసమయంలోనే అవకాశం దొరికేది ఆయనకు. ఎప్పుడైనా పెళ్ళిప్రసక్తి వచ్చినప్పుడు మాత్రం ఏదో సాకు చెప్పి తప్పించుకునేది శ్రీదేవి. ఆరోజు రాత్రి భోజనం చేస్తూండగా రామకృష్ణయ్యగారే అన్నారు. "నువ్ పెళ్ళికి ఒప్పుకోవాలి అమ్మాయ్!"- అని! ఆయన ఎంత తక్కువ మాట్లాడితే- ఆమాటలకు అంత ఎక్కువ విలువ వుంటుంది. అందుకే శ్రీదేవి బదులు చెప్పలేదు.

'మీరలా అడుగుతూండండి! అదేమో- ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకుంటూంటుంది. మనిద్దరం వెళ్ళిపోయాక...' జానకమ్మలోని మాతృహృదయం పరితపిల్లిపోయింది.

"ఏం మాటలమ్మా అవి!" అని అనగలిగింది శ్రీదేవి. చీర చెరగుతో కనుకొనలు తుడుచుకుంది జానకమ్మ.

"అవును శ్రీదేవీ! అన్నీ తెలిసినదానవి! అమ్మ మనసు తెలుసుకోవటం నీకు కష్టం కాదు. ఎంత చదువున్నా- ఎంత సంపద వున్నా- వయసొచ్చిన ఆడపిల్లవు. నిన్నొక అయ్య చేతిలో పెట్టి- పసుపుకుంకుమలతో పిల్లపాపలతో నువ్ కలకల లాడుతూంటే చూడాలని ఏతల్లి అనుకోదు?... వాన రాకడా ప్రాణంపోకడా- తెలియవంటారు... నీపెళ్ళి- మా కళ్ళముందు జరగాలని మేం కోరుకోవటం తప్పంటావా?... అయినా నువ్వంటే సుందరంబావకి ప్రాణం!... నువ్ వొప్పుకోవాలి శ్రీదేవీ!" 'తప్పదు' అని నోటితో చెప్పక పోయినా ఆభావం స్ఫురించేలా తన నిశ్చయాన్ని ప్రకటించారు రామకృష్ణయ్యగారు.

"నేను సుఖపడటం ఇష్టం లేకపోతే- మీఇష్టమొచ్చినట్లు చెయ్యండి. కానీ సుందరంబావంటే నాకు అసహ్యం!" తింటూ తింటూన్న పళ్ళెంలో చేయి కడిగేసుకుని- విసురుగా తన గదిలోకి వెళ్ళిపోయింది శ్రీదేవి. ఆమె ప్రవర్తన రామకృష్ణయ్యగారికి కోపం కలిగించింది. ఆకోపంలో తన పంతం నెగ్గించుకోవాలనే తలంపు కూడా కలిగింది. అందుకనే భోజనం పూర్తికాగానే ఆయన శ్రీదేవి గదిలోకి వెళ్ళారు. మంచంపై వాలిపోయి ఏడుస్తున్న శ్రీదేవిని చూడగానే ఆయన హృదయం ద్రవించింది. జ్ఞానం వచ్చిన

తరువాత శ్రీదేవి కంట నీరు పెట్టుకోవటం- ఆయనకు తెలియదు. కథల్లో గంభీరమయిన పాత్రలను సృష్టించే శ్రీదేవి ఎప్పుడూ ఎదుటివారికి ధైర్యం చెప్పే శ్రీదేవి- అలా ఏడవగలదనికూడా రామకృష్ణయ్యగారు అనుకోలేదు. ఆయన మనసు ప్రశాంతత కోలయమైంది. ఆయన హృదయం పరిపూర్ణమైన ప్రేమానురాగాలతో నిండిపోయింది. అక్కడే వున్న సోఫాలో కూర్చుని, టేబిల్ మీద- శ్రీదేవి సగం వ్రాసి వదిలేసిన కథను తీసి చదవటం ప్రారంభించారు. ప్రతి రోజూ రాత్రి భోజనం కాగానే- శ్రీదేవి గదిలోకి వచ్చి- ఆమె వ్రాసిన రచనలనుగానీ- వేరే ఇతర పుస్తకాలుకానీ- కాసేపు చదివి మరీ వెళ్ళటం రామకృష్ణయ్యగారి దినచర్యలో ఆఖరిఘట్టం. శ్రీదేవి వ్రాసిన ఆకథను చదువుతూంటే రామకృష్ణయ్యగారికి ఏవేవో జ్ఞాపకానికి రాసాగాయి.

* * *

వచ్చేపోయే జనంతో పబ్లిక్ గార్డెన్సు అంతా సందడిగా వుంద. మనుష్య సంచారానికి దూరంగా కూర్చున్నారు వారిద్దరూ! మామిడిచెట్టు నానుకోని కూర్చున్న శ్రీధర్, శ్రీదేవి వ్రాసిన కథను చదువుతున్నాడు. అతనికి ఎదురుగా కూర్చున్న శ్రీదేవి, అతని ముఖంలోకి తదేకంగా చూస్తోంది. ఎత్తైన విగ్రహం, విశాలమైన నుదురు, చామనచాయ, సహజమైన శ్రీధర్‌లోని అందం ఆమె నాకర్షించింది. కథచదవటం పూర్తిచేశాడు శ్రీధర్.

"వాల్మీకి- రామాయణాన్ని వ్రాసినట్లు- నువ్వో
ప్రేమాయణాన్ని వ్రాయటం బాగానేవుందికానీ- అన్నీ
మనం అనుకున్నట్లూ- కథలో వ్రాసినట్లూ- జరుగుతాయా
శ్రీదేవీ?" అన్నాడు శ్రీధర్ పైకిచూస్తూ.

"ఎందుకు జరుగకూడదూ?"

"ఏమో? అన్నీ అనుకున్నట్లుగానే జరిగితే మాన
వుడు- దేవుడున్నాడనే విషయాన్ని మరచిపోతాడు. అందుకే
అంటారు- 'మనిషి ఒకటి తలుస్తే- భగవంతుడు వేరొకటి
చేస్తాడని'- అదికాక, కవిత్వంవేరు, జీవితంవేరు. సినిమాలలో
చూస్తున్నవీ- కథలలో వ్రాస్తున్నవీ- వాస్తవంలో జరుగు
తాయని నేననుకోను. ఏమైనా- నీతో ఈపరిచయం- నే
నెప్పటికీ మరచిపోలేను శ్రీదేవీ!" సంతృప్తిగా అన్నాడు
శ్రీధర్. చీకటిపడినసూచనగా- పార్కులోని దీపాలన్నీ వెలి
గాయి. వారిద్దరూ బస్ స్టాప్ వద్దకు చేరుకున్నారు.
ముందు శ్రీదేవి ఎక్కవలసిన 'బస్' రావటంతో- శ్రీధర్
వద్ద సెలవు తీసుకొంది ఆమె.

పరుగెడుతున్న బస్‌తో పందెం వేస్తున్నాయి ఆమె
ఆలోచనలు ... నెలరోజులక్రితం- తాను తిరుపతియాత్రకు
వెళ్ళినపుడు శ్రీధర్‌తో పరిచయం కలిగింది. అతనితో పరి
చయం- కేవలం- తన జీవితంలో మరపురాని మధుర సంఘ
టనగా మాత్రమే నిలచిపోతుందేమో ననుకుంది. కానీ-
అలాజరగలేదు. తిరుపతినుండి తిరిగివచ్చిన పదిరోజులకే

మళ్లీ తాను- అతన్ని చూడగలిగింది. పార్కులో కూర్చుని- ఏదో నవల చదువుతున్న, తనవద్దకు వచ్చి- ఎంతో చనువుగా- 'నమస్తే' అన్నాడు ... తనకు- అప్పుడు ఎంతో సిగ్గేసింది అక్కడి కాలేజీలోనే- అతను ట్యూటర్ గా పనిచేస్తున్నాడని తెలుసుకొని మనసులోనే సంతోషించింది ... గమ్యంచేరిన విషయాన్ని కండక్టరు గుర్తు చేయగానే- వాస్తవానికి వచ్చి "బస్" దిగింది శ్రీదేవి.

లోపలకు అడుగుపెట్టగానే- ఎదురుగుండా వున్న దృశ్యాన్ని చూసి తుళ్లిపడింది శ్రీదేవి! సోఫాలో వెనక్కువాలి- టీపాయ్ మీద కాళ్లుపెట్టుకొని- ఏదో పుస్తకాన్ని చదువుతున్నాడు సుందరం!

"ఏం బావా? ఎప్పుడొచ్చావ్ ?"- అక్కడే వున్న మరో సోఫాలో కూర్చుంటూ అడిగింది శ్రీదేవి. అంతవరకూ పుస్తకం చదవటంలో నిమగ్నుడైన సుందరం తలెత్తి శ్రీదేవిని చూశాడు.

"నువ్వెప్పుడొచ్చావ్ శ్రీదేవీ? ... నువ్ వ్రాసిన నవల అని చెప్పి- దీన్ని మామయ్య నాకిస్తే- చదువుతూ- నేనెప్పుడొచ్చానో కూడా మరచిపోయాను" అన్నాడు సుందరం చదువుతున్న పుస్తకాన్ని మూసేస్తూ.

"సుందరానికి ఇక్కడకు బదిలీ అయిందట; ఇందాకా నాలుగ్గంటల బండిలో వచ్చాడు"- అంటూ వంటగదిలోంచి జానకమ్మ వచ్చింది.

"ఈనవల చాలా అద్భుతంగా వుంది శ్రీదేవీ!"— మాట్లాడటానికి వేరే విషయాలేవీ దొరకలేదు సుందరానికి. "చదువుతూండు వస్తాను"— అనిచెప్పి— తనగదిలోనికి వెళ్ళి పోయింది. సుందరం దగ్గర కూర్చుంటే తనకు ఎందుకో ముళ్ళమీద కూర్చున్నట్లుంటుంది అతనంటే తనకు ఎందుకో అసహ్యం ... అసలు ఆరోజు సుందరం అలా ప్రవర్తించి వుండకపోతే అతనిమీద తనకు గౌరవభావం వుండేదేమో— ఆరోజు...తలచుకుంటేనే తనకు భయం కలుగుతుంది. విదేశాలలో చదువు పూర్తి కాగానే— తిరిగి స్వగ్రామం వెడుతూ— ముందుగా తమ యింటికి వచ్చాడు సుందరం. పెద్ద చదువులు చదివి వచ్చిన తమ్ముడ్ని చూసి ఆనందించింది జానకమ్మ. కాబోయే ఇంటల్లుడు అనే గౌరవంతో— ఘనంగా విందు ఏర్పాటుచేశారు రామకృష్ణయ్యగారు. ఆరాత్రి విందు పూర్తయినతరువాత— తనగదిలోకి వచ్చాడు సుందరం. ఏవేవో మాట్లాడాడు. అతను మాట్లాడుతూంటే వచ్చిన వాసననుబట్టి— అతను తాగుడు అలవాటు చేసుకున్నాడని గ్రహించింది శ్రీదేవి. విదేశాలలో ముందు ప్రేమించుకొని, తరువాత వివాహం చేసుకుంటారనీ— భార్యాభర్తలిద్దరికీ— ఎవరి వ్యక్తిగత స్వాతంత్ర్యం వారికుంటుందనీ— ఇంకా ఏవేవో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతూ— తనదగ్గరగా వచ్చాడు. తన రెండు చేతులతోనూ ఆమెను బలంగా పట్టుకొని దగ్గరకు లాక్కోబోయిన అతని చెంప ఛెళ్ళుమనిపించింది తను. మైకం

వదిలిన సుందరం మారుచెప్పక క్రిందకు వెళ్ళిపోయాడు. ఆతనిపై అంతవరకూ ఆమెకున్న గౌరవం కూడా పోయింది. అందుకే సుందరంబావంటే అసహ్యం తనకు. కానీ ఈసంగతి తనతల్లి తండ్రులకు తెలియనివ్వలేదు తను. మనిషికన్నా-అతనిలోని సంస్కారానికి ఎక్కువ విలువ నిస్తుంది శ్రీదేవి.

ఆ రాత్రి భోజనాల తరువాత శ్రీదేవి గదిలోకి వచ్చాడు సుందరం భయపడింది శ్రీదేవి.

'మరేం భయంలేదు శ్రీదేవి! నిన్ను బలవంతం చేయటానికి రాలేదులే! ఆనాటి నాప్రవర్తనకు చాలా సిగ్గుపడ్డాను. అపార్థం చేసుకోవద్దనీ, నన్ను మన్నించమనీ- ఆమరునాడే నీకు చెప్పాలనుకున్నాను. కానీ నాముఖం చూపటానిక్కి కూడా మనస్కరించలేదు. అందుకే నీకు చెప్పకుండానే వెళ్ళిపోయాను అప్పుడు' అని ఆగాడు సుందరం. బదులుగా ఏమీ చెప్పలేదు శ్రీదేవి.

"నన్ను హౌస్ సర్జన్‌గా ఇక్కడి హాస్పిటల్‌కు బదిలీ చేశారు. ఇక్కడకు వచ్చి నిన్ను మళ్ళీ చూడటానికి చాలా సిగ్గుపడ్డాను."

"ఫరవాలేదు బావా! ఆనాడు జరిగిన సంఘటన ఒక పీడకల అంతే! అయినా నే నెప్పుడో మరచిపోయాను- దానిని గురించి నువ్ అంతగా బాధపడనవసరం లేదు"- అబద్ధమాడింది శ్రీదేవి. నిజానికి ఆరోజును తాను ఎప్పుడూ మరచిపోదు.

కొన్ని క్షణాల నిశ్శబ్దం తరువాత సుందరం మళ్ళీ అన్నాడు-

"ఆమధ్య మన పెళ్ళిగురించి మామయ్య ఉత్తరం వ్రాశాడు. దానికి నేను వ్రాసిన జవాబు చూసేవుంటావ్ ! నీకు ఏమీ అభ్యంతరం లేకపోతే మనపెళ్ళి జరగటానికి నాకు అభ్యంతరమేమీ ఉండదని వ్రాశాను"- అంతలోనే రామ కృష్ణయ్యగారుకూడా అక్కడకు వచ్చారు. కాసేపు పిచ్చాపాటీ అయినతరువాత- అంతకు రెండురోజులముందు చదివిన కథగురించి శ్రీదేవిని అడిగారు ఆయన. ఆరోజునే పూర్తి చేసిన ఆకథను తన తండ్రికి ఇచ్చింది శ్రీదేవి.

"కథలపోటీకి వ్రాశావా?" అని అడిగా రాయన. "ప్రత్యేకం పోటీకి వ్రాయలేదు; కానీ గడువుందని వ్రాసిన కథను పోటీకి పంపుతున్నాను" అన్నది శ్రీదేవి. కథ చదవటం పూర్తిచేసిన రామకృష్ణయ్యగారు- 'చాలా అసహజంగా వుంది' అన్నారు ముక్తసరిగా.

తానువ్రాసిన ప్రతిరచననూ తనతండ్రి చూసిన తరువాతే పత్రికలకు పంపించేది శ్రీదేవి. ఆరచనలను అవసరమయితే ఆయన అభిప్రాయానికి అనుగుణంగా మార్చేది. కానీ తను ఇప్పుడు వ్రాసినకథ అసహజంగా వుందని ఆయన అనటం శ్రీదేవికి బాధ కలిగించింది. తిరుపతియాత్రలో పరిచయం చేసుకున్న ఇద్దరుప్రేమికుల పవిత్రగాథ అది. హైందవ స్త్రీ ఒకసారే- ఒక్కరికే తన హృదయాన్ని ఇవ్వగలదనే

సత్యాన్ని చాటి చెప్పేకథ అది. పరిస్థితుల నెదిరించి, తాను మనసిచ్చిన వానినే చివరకు వివాహం చేసుకోవటంతో కథ సుఖాంత మవుతుంది. ఏమైనా ఆకథను పత్రికకు పంపటానికే నిశ్చయించుకొంది శ్రీదేవి.

*　　　*　　　*

"హలో శ్రీదేవి! కంగ్రాచ్యులేషన్స్!" అంటూ లోపలకు వచ్చిన సుందరాన్ని చూసి- అర్థంకాక ఆశ్చర్యపడింది శ్రీదేవి.

ప్రొద్దున్న మామయ్య హాస్పిటల్‌కువచ్చి నీపెళ్ళిసంగతి చెప్పాడు. అప్పుడే వచ్చి నా అభినందనలు తెలపాలనుకున్నాను, అవకాశం లేక ఆలస్యమయింది. ఇంతకీ శ్రీధర్ ఎవరో కానీ చాలా అదృష్టవంతుడు శ్రీదేవి!" ఏదో మాట్లాడుతున్నాడు సుందరం. అంతా అయోమయంగా వుంది ఆమెకు. తనవివాహం శ్రీధర్‌తో నిశ్చయమైందా? శ్రీధర్ సంగతి తనతండ్రికి ఎలా తెలుసు? సుందరాన్ని పెళ్ళి చేసుకోమని ఒకసందర్భంలో రామకృష్ణయ్యగారు అడిగినపుడు తన అసమ్మతిని తెలియపరచింది. శ్రీధర్‌ను ప్రేమించిన విషయం- తను వ్రాసిన కథద్వారా తెలుసుకొని వుండవచ్చు. లేకపోతే తాను శ్రీధర్‌తో 'పబ్లిక్ గార్డెన్స్' లో వున్నపుడు తనతండ్రి చూసివుండవచ్చు. శ్రీదేవి హృదయం తనతండ్రిపై ప్రేమతో నిండిపోయింది. కనుకొనలలో నిలచిన ఆనందాశ్రువులు తుడుచుకొంది.

"నన్ను క్షమించు బావా! నువ్ బహుశా నామీద ఆశలు పెట్టుకొని వుండవచ్చు. మనవివాహంగురించి నాన్నగారు అడిగినపుడు నేనే అభ్యంతరం చెప్పాను...." ఇంకా ఏవేవో చెప్పాలనుకొన్న శ్రీదేవిని వారించి —

"చాలు శ్రీదేవీ! చాలు! అవన్నీ ఇపుడెందుకు? నీపై నేనుంచుకొన్న ఆశల్ని మధురస్మృతులుగానైనా నిలచి పోనీయ్! అంతే చాలు!– వస్తాను"– అంటూ అక్కడినుండి వెళ్లిపోయాడు సుందరం.

శ్రీదేవికి ఏమీ తోచలేదు. తనహృదయం ఎందుకో ఆనందంతో ఉరకలు వేస్తోంది. ఆరాత్రి తనవద్దకు వచ్చినరామకృష్ణయ్యగారేఅన్నారు– 'నీకథానాయకుడు శ్రీధర్ తో నీపెళ్లి జరుగబోతోంది' అని. తండ్రిపాదాలకు నమస్కరించింది శ్రీదేవి.

"కన్నకూతురి సుఖం మీరు ఎపుడూ కోరతారనే విషయం తెలుసుండికూడా సుందరం బావను పెళ్లిచేసుకోవాలని మీరన్నపుడు అనవసరంగా ఆవేశపడ్డాను. నన్ను మన్నించండి నాన్నా"– అంది శ్రీదేవి.

"లేదు శ్రీదేవీ! అన్నివిషయాలలోనూ నీకు పూర్తి స్వాతంత్ర్యం వుంది. కానీ సుందరంబావను నువ్ అపార్థం చేసుకున్నావమ్మా" అన్నారు రామకృష్ణయ్యగారు ఆమెతల నిమురుతూ.

శ్రీదేవి బదులు చెప్పలేదు.

* * *

శ్రీదేవీ-శ్రీధరుల వివాహం వైభవంగా జరిగింది. కావలసినవారూ, రావలసినవారూ అందరూ వచ్చారు. సుందరం రానందుకు చాలా బాధపడ్డారు రామకృష్ణయ్య దంపతులు. ఊహాలోకంలో విహరించే శ్రీదేవికి- వచ్చినవారెవరో, రానివారెవరో తెలియదు.

...అది మొదటిరాత్రి-శ్రీదేవి ఎన్నో వెన్నెలరాత్రులు గడిపింది; ఎన్నో వసంతాలు చూసింది; వెన్నెలలో వుండే వేడినీ, వసంతంలో వుండే హాయినీ- తాను అనేక కథలలో వర్ణించింది. కానీ తన సర్వస్వాన్నీ తన జీవితేశ్వరునకు అంకితం చేసుకుంటున్న పర్వదినమది. తన జీవితాన్ని మాధుర్యమైన మలుపులోకి మార్చుకుంటున్న మొదటిరాత్రి అది.

"చివరకు నీకథ నిజం చేసుకున్నావు శ్రీదేవీ!" అతని గుండెలపై తలవాల్చి, తన ఆనందాన్ని మూగభాషలో వ్యక్తం చేస్తున్న శ్రీదేవి ముంగురులను సవరిస్తూ అన్నాడు శ్రీధర్. అంతలోనే ఏదో గుర్తుకు రావటంతో తన జేబు నుండి ఒక కవరుతీసి- "నీపేర ఉత్తరం వచ్చింది"- అంటూ శ్రీదేవికి ఇచ్చాడు.

కవరు చించి, ఉత్తరంతీసి చదివింది శ్రీదేవి. చదివిన తరువాత అనుకుంది- "సుందరం బావను నిజంగానే అపార్థం చేసుకున్నాను"- అని.

"ఏమిటి శ్రీదేవీ! సుందరం అంటున్నావ్? నువ్

చెప్పేది డాక్టరు సుందరం గురించేనా ?" అన్నాడు శ్రీధర్. తాను చదివిన ఉత్తరాన్ని అతనికిచ్చింది శ్రీదేవి.

"శ్రీదేవి !...

బహుశా ఈ ఉత్తరం నీచేతికి వచ్చేసరికి నేను నీకు చాలా దూరంలో వుంటాను. పెళ్ళికి రాలేకపోయాను. అయినా నేను రానిలోటు నీకు కనిపించి వుండదు. శ్రీధర్ యోగ్యుడు ! నాస్నేహితుడుకూడా. ఒకసారి 'పబ్లిక్ గార్డెన్స్‌లో' మీరిద్దరూ కనిపించారు. మిమ్మల్ని వేరుచేయటం- పవిత్రప్రేమను భగ్నం చేయటం- పాపమని తోచింది. ఒకసారి నీదగ్గర పశువులా ప్రవర్తించిన నాకూ మంచి హృదయం వుందని నీకు తెలియచెప్పా లనుకున్నాను. ఎలాగైనా మన పెళ్ళి చేస్తానన్న మామయ్యతో మీ ప్రేమసంగతి చెప్పాను. నేను విదేశాలలో వుండగా అక్కడ వేరొకరితో నాకు ఎప్పుడో వివాహమైపోయిందని మామయ్యకు అబద్ధంచెప్పాను. కానీ తరువాత విజం దాగలేదు. మొత్తానికి నేనే విజయం పొందాను. మామయ్య మీపెళ్ళికి ఒప్పుకోవటం నావిజయం కాదంటావా ? ఇంతచేసినవాడివి పెళ్ళికి ఎందుకు రాలేదని నువ్ అడగవచ్చు. అలా అడిగే అధికారం నీకు ఎప్పుడూ వుంటుంది. నువ్ పుట్టినప్పుడే 'సుందరానికి పెళ్ళాం పుట్టింది' అనేవారట అందరూ. నేనుకూడా నిన్ను అలాగే వూహించుకున్నాను. నాస్థానాన్ని మరొకరు ఆక్రమించటం నేనుచూడలేను. అటువంటి దృశ్యాన్ని చూసినప్పుడు నాహృదయంలో

అగ్నిపర్వతాలే బ్రద్దలవుతాయి. ఆవేశం వచ్చినప్పుడు చాలా అసభ్యంగా ప్రవర్తిస్తూంటాను. అది నాలో వున్న బలహీనతే అను- మరొకటి అను. అందుకే నేను ఆనాడు ఆవేశంలో నీవద్ద చాలా నీచంగా ప్రవర్తించాను. తరువాత పశ్చాత్తాపపడిమాత్రం ప్రయోజనం ఏముంటుంది? అందుకే పెళ్ళి చూసేందుకు రాలేకపోయాను. నేనంటే ఎందుకో నీకు మంచి అభిప్రాయం లేదని అక్కయ్య చెప్పింది. ఎందుకో నాకు అర్థం కాలేదు. ఇప్పటికైనా నన్నొక మంచిమనిషిగా అర్థం చేసుకుంటే అంతేచాలు"

నీబావ,

సుందరం.

ఉత్తరం చదవటం పూర్తిచేసిన శ్రీధర్- శ్రీదేవి కళ్ళలోకి చూశాడు. ఆమె కనుకొనలలో అశ్రుకణాలు మెరవటం గమనించాడు.

---